క్లుప్తంగా

మునికోటి ప్రాణత్యాగం మరువలేనిది

కర్నూలు(సెంట్రల్): ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కోసం తిరుపతికి చెందిన మునికోటి ప్రాణత్యాగం చేయడం మురువలేనిదని డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు అన్నారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మునికోటి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. తిరుపతి కేంద్రంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన ఏపీకి ప్రత్యేక హోదా హామీని అమలు చేయకపోవడంతో మునికోటి ప్రాణత్యాగం చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో ఏపీ ప్రజలు ప్రత్యేక హోదా కోసం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు బతుకన్న,సయ్యద్ నవీద్, ఎస్.ప్రమీళ, సయ్యద్ ఖాద్రి బాషా, బి.సుబ్రమణ్యం, శేషయ్య, రత్నం పాల్గొన్నారు.

వీఆర్వోల సమస్యలను పరిష్కరించండి

కర్నూలు(సెంట్రల్): వీఆర్వోలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఏపీ వీఆర్వో గ్రేడ్-2 అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమణ, జిల్లా కోశాధికారి కుమార్‌యాదవ్ అధికారులను కో రారు. శుక్రవారం కలెక్టరేట్ ఏఓగా బాధ్యతలు చేపట్టిన రామేశ్వరికి సంఘం తరఫున శుభాకాంక్షలు తెలిపారు. వీఆర్వోలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆమె దృష్టికి తెచ్చారు. ముఖ్యంగా గ్రేడ్-2 వీఆర్వోల ప్రొబేషన్ డిక్లేర్, వీఆర్వో గ్రేడ్-1 పదోన్నతుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని పరిష్కరించాలని కోరారు. నాయకులు రాముడు, సోమన్న, ఖాజాబాషా, మద్దిలేటి పాల్గొన్నారు.

ట్రాఫిక్‌ను నియంత్రించాలి

కర్నూలు (టౌన్): కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లో ట్రాఫిక్ నియంత్రణకు సర్కిల్ ఏర్పాటు చేయాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నగేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక నగరపాలకలో కమిషనర్ రామలింగేశ్వర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్లూరు చెన్నమ్మ సర్కిల్ నుంచి ముజఫర్ నగర్ వరకు కొత్తగా రోడ్డు వేసి డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. సెంట్రల్ లైటింగ్ లేకపోవడం వల్ల ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఆ సంఘం నాయకులు ఇమ్రాన్, హుస్సేన్ బాష పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

కర్నూలు(సెంట్రల్): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ప్రభుత్వం పునరుద్ధరించాలని సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు కె.సుధకారప్ప డిమాండ్‌చేశారు. శుక్రవారం కల్లూరు సూర్యనారాయణ భవన్‌లో జరిగిన మట్టి పని కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో హామీ ఇచ్చిన చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమ బోర్డుపై ఏమీ మాట్లాడడం లేదన్నారు. అలాగే జీఓలు, 1214 మెమో ద్వారా భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అందకుండా చే శారని ఆవేదన వ్యక్తంచేశారు. నాయకులు జి. ఏసు, వేణు, శ్రీనివాసులు, దాసు, ఈశ్వరమ్మ, శాంతమ్మ ఉన్నారు.

వక్ఫ్ చట్ట సవరణ బిల్లును సమర్థించడం అన్యాయం

కర్నూలు(సెంట్రల్):కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ చట్ట బిల్లును తెలుగుదేశం, జనసేన పార్టీలు సమర్థించడం అన్యాయమని ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ సుభాన్, రాష్ట్ర కమిటీ సభ్యుడు షేక్ మహ్మద్ షరీఫ్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముస్లిం ఓట్లతో అధికారంలోకి వచ్చిన టీడీపీ, జనసేన పార్టీలు వారికి అన్యాయం చేయడం భావ్యం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీకి నిజంగా ముస్లింలపై ప్రేమ ఉంటే సచార్, రంగనాథ కమిటీ నివేదికలను బహిర్గతం చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంతే తప్పా వక్ఫ్ కమిటీల్లో ముస్లిమేతరులకు సభ్యత్వం కల్పించడం దేనికని ప్రశ్నించారు.

స్పోర్ట్స్ క్యాలెండర్‌ను రూపొందించాలి

కర్నూలు(సెంట్రల్): రాయలసీమ యూనివర్సిటీ విద్యార్థులు 2024-25 సంవత్సరంలో పాల్గొనే క్రీడల వివరాలతో స్పోర్ట్స్ క్యాలెండర్‌ను రూపొందించాలని వైస్‌చాన్సలర్ ఎన్‌టీకే నాయక్ అధికారులకు సూచించారు. శుక్రవారం వీసీ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ అడ్వైజరీ బోర్డు మీటింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. 2024-25లోనూ ఆర్‌యూలో క్రీడల నిర్వహనపై పలు సూచనలు చేశారు. రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ శివకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన దిశ పీఎస్ డీఎస్పీ


కె.శ్రీనివాసాచారి

కర్నూలు: కర్నూలు దిశ మహిళా పీఎస్ డీఎస్పీగా నియమితులైన కె.శ్రీనివాసాచారి విధుల్లో చేరారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఇక్కడున్న బాబుప్రసాద్ కర్నూలు డీఎస్పీగా బదిలీ కావడంతో తిరుమల లా అండ్ ఆర్డర్ డీఎస్పీగా ఉన్న శ్రీనివాసాచారిని కర్నూలు దిశ పీఎస్‌కు నియమించారు. ఆయన శుక్రవారం రాత్రి బాధ్యతలు చేపట్టారు.

రాజ్యాంగ నిర్మాత విగ్రహం విధ్వంసానికి కుట్ర

- అంబేద్కర్ మహా విగ్రహంపై దాడా?
- రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా? లేదా ?
- భారత రాజ్యాంగ నిర్మాత విగ్రహానికి రక్షణ కరువు
- స్వరాజ్ మైదానంలో పేట్రేగిపోయిన విధ్వంసం
- సుత్తులు, ఇతర పరికరాలతో శిలా ఫలకాల ధ్వంసం హేయమైన చర్య
- సంఘటనను తీవ్రంగా ఖండించిన ప్రజా సంఘాలు


నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, ఎమ్మెల్సీ మధుసూదన్, తదితరులు

కర్నూలు(అర్బన్): బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా, అట్టడుగు వర్గాల తలరాతను మార్చే విధంగా భారత రాజ్యాంగాన్ని రూపొందించిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహంపై గురువారం రాత్రి దాడి చేయడం అత్యంత హేయమైన చర్య అని ప్రజా సంఘాల నాయకులు తీవ్రంగా మండిపడుతున్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రపంచ మేధావి అయిన అంబేడ్కర్ విగ్రహాన్ని రూ.404.35 కోట్లు వెచ్చించి విజయవాడ నగర నడిబొడ్డున స్వరాజ్ మైదానంలో అత్యంత అద్భుతంగా ప్రతిష్ఠించారన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సామాజిక న్యాయ మహా శిల్పాన్ని, స్మృతివనాన్ని రోజూ వందల మంది సందర్శిస్తున్నారన్నారు. ఇలాంటిచోట అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసేందుకు ప్రయత్నించడం దారుణమన్నారు. ఈ ఘటనను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రజాస్వామ్యవాదులు, మేధావులు ఖండించాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వైఎస్ జగన్ పేరును చెరపలేరు



విజయవాడలోని స్వరాజ్ మైదానంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహంపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. ప్రభుత్వాలు వస్తుంటాయి, పోతుంటాయి, కానీ ఈ విగ్రహాన్ని ఆవిష్కరించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేరును అంబేద్కర్ విగ్రహం శిలాఫలకంపై ఎవరు చెరిపేయలేరు. ఈ దాడికి పాల్పడిన దుండగులను వెంటనే పట్టుకొని శిక్షించాలి. ప్రపంచంలోనే అతి పెద్ద అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కింది.

– కాసారపు వెంకటేష్, మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

దుండగులను అరెస్ట్ చేసి శిక్షించాలి



ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 125 అడుగుల మహా విగ్రహాన్ని ధ్వంసం చేసేందుకు ప్రయత్నించిన దుండగులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలి. భారతదేశంలో సామాజిక న్యాయం కోసం, పేదరికం, అంటరానితనం విముక్తి కోసం అనేక ఉద్యమాలు చేసి రాజ్యాంగాన్ని రచించిన మహనీయుని విగ్రహంపై దాడికి పాల్పడటం హేయమైన చర్య. ఈ సంఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించాలి. ఇందుకు కారకులైన వారిని గుర్తించి చర్యలు చేపట్టాలి. పాక్షికంగా దెబ్బతిన్న శిలా ఫలకాలు, ఇతరత్రా కట్టడాలను పునరుద్ధరించాలి .

– పీ రాజీవ్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

సామాజిక న్యాయ శిల్పం పగలగొట్టడం అమానుషం



భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ శిలా ఫలకం, విగ్రహంపై దాడికి ప్రయత్నించడం అమానుషం. ప్రపంచ మేధావిగా గుర్తింపు పొందిన అంబేద్కర్ 125 అడుగుల మహావిగ్రహాన్ని, స్మృతివనాన్ని రాష్ట్రంలో ఏర్పాటు చేయడం వల్ల దేశవ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తాయి. ఈ సామాజిక న్యాయ మహా శిల్పం ఏర్పాటు వల్ల మన రాష్ట్ర ఖ్యాతి దేశమంతా వ్యాపించింది. ఇలాంటి సమయంలో మహనీయుని విగ్రహంపై దాడి జరగడం వల్ల మన రాష్ట్ర ప్రతిష్ట మంటగలుస్తోంది. ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే దళిత,గిరిజన, ప్రజా శ్రామికుల ఆగ్రహానికి ప్రభుత్వాలు కూలడం తథ్యం.

– ఆర్.చంద్రప్ప, టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలో విద్యుత్ సబ్‌స్టేషన్లు, లైన్ల మెయింటెనెన్స్ పనులు చేపడుతున్న కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ రాజేంద్రబాబు తెలిపారు. క్యాంపస్ సెక్షన్ పరిధిలోని మద్దూర్‌నగర్, సీక్యాంపు, గణేష్‌నగర్, రెవెన్యూ కాలనీ, 4వ తరగతి ఉద్యోగుల సంఘం కాలనీ, సాయి వైభవ్‌నగర్, చెక్‌పోస్టు ఏరియా, శేషాద్రినగర్, బృందావన్‌నగర్, మారుతి నగర్, అరుంధతీ నగర్, రెవెన్యూకాలనీ శ్రీరామ్‌నగర్, మారుతీ మెగాసిటీ, పోస్టల్ కాలనీ, ధనలక్ష్మినగర్, కమలానగర్, టెలికాంనగర్, గఫార్ నగర్, పరాసతినగర్, ఫుడ్ కార్పొరేషన్ ఏరియా, కిసాన్ నగర్, శ్రీనగర్ కాలనీ, లెక్చరర్స్ కాలనీ, మాధవ నగర్, సీ, బీ క్యాంప్‌లు, గాయత్రీ ఎస్టేటు, లక్ష్మినగర్ ఏరియా, ఓల్డ్‌టౌన్, జొహరాపురం, ఇందిరమ్మ బిల్డింగ్స్, హౌసింగ్ బోర్డు, జమ్మిచెట్టు ఏరి యా, రాంబొట్ల దేవాలయం ఏరియా, కమేళ ఏరి యా, ఎస్టేటు సెక్షన్ పరిధిలోని అబ్బాస్ నగర్, కృష్ణానగర్, రామకృష్ణనగర్, రామచంద్ర నగర్, గుత్తి పెట్రోల్ బంకు ఏరియా, శరీన్‌నగర్, కల్లూరు ఎస్టేటు, శారద నగర్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. కర్నూలు ఆపరేషన్ సబ్ డివిజన్ పరిధిలోని 33 కేవీ ఎస్టేటు, చిన్న టేకూరు, ఉల్లిందకొండ, పంచలింగాల, నన్నూరు, ఓర్వకల్ ఫీడర్లలో మరమ్మతులు చేస్తున్నట్లు డీఈఈ వై.సుబ్బన్న తెలిపారు. అలాగే కల్లూరు, కర్నూలు, ఓర్వకల్ మండలాల్లోని అన్ని సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

– కర్నూలు రూరల్ సెక్షన్ పరిధిలోని పంచలింగాల, నందికొట్కూరు ఫీడర్లకు మరమ్మతులు చేయనుండడంతో శనివారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు కర్నూలు మండలం ఆపరేషన్/అసిస్టెంట్ ఇంజనీర్ వి.ఆంజనేయశాస్త్రి ఒక ప్రకటనలో తెలిపారు.

కార్పొరేట్ దోపిడీదారులకు బుద్ధిచెబుతాం


కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): దేశ సంపదను దోచుకుంటున్న కార్పొరేట్ వ్యవస్థను తరిమికొట్టేందుకు క్విట్ ఇండియా ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని 'క్విట్ కార్పొరేట్'కు శ్రీకారం చుడతామని ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా కార్యదర్శులు ఎస్.మునెప్ప, ఎండీ అంజిబాబు పేర్కొన్నారు. శుక్రవారం కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట ప్రజా సంఘాల ఆధ్వర్యంలో క్విట్ కార్పొరేట్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1942 ఆగస్టు 9న జాతిపిత మహాత్మా గాంధీజీ దేశాన్ని పాలిస్తున్న బ్రిటీషర్లను తరిమికొట్టేందుకు క్విట్ ఇండియా ఉద్యమానికి పిలుపునిచ్చారన్నారు. ఆయన స్ఫూర్తితో దేశం నుంచి కార్పొరేట్‌ను సాగనంపేందుకు ఉద్యమిస్తామన్నారు. కార్పొరేట్ విధానంతో దేశ సంపద అంతా అదానీ, అంబానీల చెంతకే వెళ్లిపోతోందన్నారు. నిజాయితీగా వ్యాపారాలు చేసే వారికి ఎలాంటి కాంట్రాక్టులు, అవకాశాలు దక్కడం లేదని వాపోయారు. దేశంలోని ఎంతో మంది పేదలకు నేటికీ కనీసం కూడు, గూడు సమకూరడం లేదన్నారు. రైతన్నలు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలేదన్నారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన పాలకులకు బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం, ఐఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి కె.వెంకటేష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుంకన్న పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కిడ్నాప్ కేసులో నిందితుల అరెస్ట్

కర్నూలు: కర్నూలులోని శ్రీరాం నగర్‌లో నివాసముంటున్న సల్కాపురం ప్రవీణ్‌కుశాల్ కిడ్నాప్ కేసులో నిందితులను 3వ పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. గురువారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్తున్న ప్రవీణ్‌కుశాల్‌ను సమీప కాలనీలో అడ్డుకుని పర్ల పెద్ద మద్దిలేటితో పాటు స్నేహితులు కందోలి అనిల్‌కుమార్, మేకపోగు సురేష్, గూడూరు భాస్కర్‌రెడ్డి, తేజ, మిథున్ తదితరులు తమ వాహనంలో కిడ్నాప్ చేశారు. కుశాల్ తండ్రి సల్కాపురం రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి పక్కా ఆధారాలతో నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం బయటపడింది. ప్రవీణ్ కుశాల్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ పలువురితో ఆర్థిక లావాదేవీలు నడిపాడు. పర్ల గ్రామానికి చెందిన పెద్ద మద్దిలేటికి గత ఎన్నికల్లో కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గం టిక్కెట్ ఇప్పిస్తానని చెప్పి రూ.2 కోట్లు తీసుకున్నాడని, ఆ డబ్బులు తిరిగి ఇప్పించుకునేందుకు కిడ్నాప్ చేసినట్లు నిందితులు అంగీకరించారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచినట్లు సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు.

3 టిప్పర్లు, ట్రాక్టర్ సీజ్

కర్నూలు (టౌన్): అక్రమంగా కంకర, ఇసుక తరలిస్తున్న 3 టిప్పర్లు, ట్రాక్టర్‌ను మైనింగ్ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. కర్నూలు నగర శివారులోని రింగ్ రోడ్డు సమీపంలో అనుమతులు లేకుండా కంకర, ఇసుక తరలిస్తున్న వాహనాలను మైనింగ్ విజిలెన్స్ అధికారులు సీజ్ చేసి వారి వద్ద నుంచి రూ. 58 వేలు జరిమానా వసూలు చేసినట్లు జిల్లా మైనింగ్, భూగర్భ శాఖ ఉప సంచాలకులు రాజశేఖర్ వెల్లడించారు.

స్పోర్ట్స్

ఒలింపిక్స్ పతక సంబరాలు


జయహో భారత్ అంటూ నినాదాలు చేస్తున్న క్రీడా సంఘాల ప్రతినిధులు

కర్నూలు (టౌన్): ప్యారిస్ ఒలింపిక్స్‌లో భారత హాకీ జట్టు కాంస్య పతకం సాధించడంపై శుక్రవారం క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాకారులు సంబరాలు చేసుకున్నారు. స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ విగ్రహం వద్దకు పెద్ద సంఖ్యలో క్రీడాకారులు చేరుకున్నారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. జాతీయ జెండాలను పట్టుకొని జయహో ఇండియా అంటూ నినదాలు చేశారు. మిఠాయిలు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు దాసరి సుధీర్, శ్రీధర్ రెడ్డి,షేక్షావలీ, వేణుగోపాల్, చిన్న సుంకన్న పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి


కర్నూలు (టౌన్): చిత్తూరు జిల్లా వి.కోట పట్టణంలో ఈనెల 10, 11 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ షూటింగ్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటాలని న్యాయవాది శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం వద్ద రాష్ట్ర పోటీల్లో పాల్గొనే జట్టును అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించి విజేతలుగా తిరిగిరావాలన్నారు. షూటింగ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరశురాముడు ఉన్నారు.

కర్నూలు (టౌన్): ఈనెల 10, 11 తేదీల్లో గుంటూరు జిల్లా వినుకొండలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సీనియర్స్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటాలని మాంటిస్సోరి విద్యానగర్ ఉన్నత పాఠశాల కో-ఆర్డినేటర్ రేణుక సూచించారు. శుక్రవారం స్థానిక పాఠశాల ప్రాంగణంలో క్రీడాకారులకు క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. సాఫ్ట్‌బాల్ సంఘం కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ

కర్నూలు సిటీ: నగర శివారులోని రిడ్జ్ స్కూల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. యూనివర్సల్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఢిల్లీ వారి భాగస్వామ్యం, వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండిపెండెన్స్ స్కౌట్స్ (జర్మనీ) జాతీయ శిక్షణ కమిషనర్ బిందియా త్యాగి బృందం పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో సీఈఓ గోపినాథ్ పాల్గొని ప్రసంగించారు. క్లిష్ట పరిస్థితుల్లో తమ సామర్థ్యాలను వినియోగించుకుంటూ ఎలా ముందుకు సాగాలో స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ నేర్పిస్తుందన్నారు. స్కూల్ డీన్ రాజేంద్రన్ మాట్లాడారు. విద్యార్థులు ప్రదర్శించిన బృంద సహకార కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ రాజ్‌కమల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డేంజరస్ పార్కింగ్‌పై స్పెషల్ డ్రైవ్


వాహనానికి వీల్‌లాక్ చేస్తున్న పోలీసు

కర్నూలు: నగరంలో డేంజరస్ పార్కింగ్‌పై ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ట్రాఫిక్ సీఐ గౌతమి ఆధ్వర్యంలో బృందాలుగా ఏర్పడి శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. డీవీఆర్ హోటల్‌కు ఎదురుగా చిల్డ్రన్స్ పార్కు వైపు వరుసగా కార్లు పార్కు చేసి ఉండడంతో వీల్ లాక్ చేసి కొత్తపేటలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అలాగే జిల్లా పోలీసు కార్యాలయం సమీపంలోని పోలీస్ పెట్రోల్ బంకు ఎదురుగా నిలిపిఉంచిన ఏడు వాహనాలను స్టేషన్‌కు తరలించారు. ఒక్కో వాహనానికి రూ.1035 చొప్పున జరిమానా వసూలు చేశారు. వాహన యజమానులను స్టేషన్‌కు పిలిపించి సీఐ గౌతమి కౌన్సెలింగ్ ఇచ్చారు. అలాగే రాధాకృష్ణ థియేటర్ నుంచి నెహ్రూ రోడ్డు మీదుగా చౌక్‌బజార్, మించిన్ బజార్ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కొన్ని ఆటోలను స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా రోడ్డుపై వ్యాపారాలు చేసుకుంటున్న తోపుడు బండ్లను కూడా వ్యాన్‌లో స్టేషన్‌కు తరలించారు.

ఆదివాసీలు అవకాశాలను అందిపుచ్చుకోవాలి


మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన ఎమ్మెల్యేలు


గిరిజన వేషధారణలో విద్యార్థుల నృత్య ప్రదర్శన

కర్నూలు(సెంట్రల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఆదివాసీలు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా సూచించారు. గిరిజనుల విద్యా, వైద్యం కోసం అన్ని రకాల చర్యలు తీసుకుంటానని, ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని గిరిజన సంఘాల నాయకులకు హామీ ఇచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహించారు. ముందుగా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎమ్మెల్యేలు గౌరు చరితా రెడ్డి, కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి జ్యోతి ప్రజ్వలన గావించారు. అనంతరం గిరిజనుల సంక్షేమం కోసం పోరాడిన బిర్సాముండా, అల్లూరి సీతారామ రాజు, మల్లుదొర, గంటందొరల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు. గిరిజన విద్యార్థుల కోసం డీఎస్సీ కోచింగ్ సెంటర్, తుగ్గలిలో గిరిజన వసతి గృహాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. గిరిజన, వెనుకబడిన, సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో మరమ్మతుల కోసం రూ.11 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి మాట్లాడుతూ.. నేటికీ చాలా గిరిజన గూడేలు, తండాలకు సరైన రోడ్డు, మంచినీరు, వైద్య సదుపాయాలు లేకపోవడం బాధాకరమన్నారు. పాణ్యం నియోజకవర్గంలోని గిరిజన, చెంచుకాలనీల్లో సరైన వసతులులేవని, చాలా మందికి ఆధార్ లేకపోవడంతో సంక్షేమ పథకాలకు దూరమవుతున్నట్లు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. కనీసం రేషన్ కార్డులను ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ.. పత్తికొండ ప్రాంతంలో ట్రైబల్ హ్యాండ్లూమ్‌ను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ.. గిరిజనులకు కనీస మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వాల బాధ్యత అన్నారు. అనంతరం గిరిజన సంక్షేమ పాఠశాలల్లో 10వ తరగతి ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు కలెక్టర్, ఎమ్మెల్యేలు పురస్కారాలు అందజేశారు. స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు గిరిజన వేషధారణలో చేసిన నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఇన్‌చార్జ్ జేసీ కె.మధుసూదన్‌రావు, ఇన్‌చార్జ్ గిరిజన సంక్షేమ అధికారి రంగలక్ష్మిదేవి, గిరిజన సంఘాల నాయకులు ఆర్.కై లాష్ నాయక్, పి.గోవిందు, ఎరుకులరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'స్వర రాగ ప్రవాహం' విభావరి

- హాజరుకానున్న పద్మవిభూషణ్ డాక్టర్ కేజే యేసుదాసు

కర్నూలు(సెంట్రల్): స్థానిక టీజీవీ కళాక్షేత్రంలో శనివారం సాయంత్రం 6 గంటలకు సుమధుర గీతాల 'స్వర రాగ ప్రవాహం' విభావరి నిర్వహించనున్నట్లు చైర్మన్ పత్తి ఓబులయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మహాగాయకులు పద్మవిభూషణ్ డాక్టర్ కేజే యేసుదాసు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. సంగీత ప్రియులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

తండాల్లో వైద్య శిబిరాలు


మాట్లాడుతున్న బి.లీలా వెంకటశేషాద్రి

కర్నూలు (లీగల్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జి.కబర్ది ఆదేశాల మేరకు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి ఆధ్వర్యంలో కొల్లంపల్లితండా, ఓబులాపురం తండాలలో వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ శిబిరంలో మలేరియా, డెంగ్యూ, రక్తహీనత, షుగర్ టెస్ట్, స్కానింగ్ టెస్టులను నిర్వహించి లోపం ఉన్నవారికి మాత్రలు ఇచ్చారు. 300 మందికి వైద్య చికిత్సలందించారు. డీఎంహెచ్‌ఓ ఎల్. భాస్కర్ సహకారంతో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఉలిందకొండ ఏఎస్‌ఐలు, వైద్యులు ఎం.రఘు, ఆనంద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతా

కర్నూలు (టౌన్): కర్నూలు నగరాన్ని స్మార్ట్‌సిటీగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, వాణిజ్యశాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక 51వ వార్డు ఈసీఎం కాంపౌండ్‌లో రూ.50 లక్షలతో సీసీ డ్రైన్ నిర్మాణానికి మంత్రితో పాటు నగర మేయర్ బీవై.రామయ్య, కమిషనర్ రామలింగేశ్వర్ కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పాతబస్తీలో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ఎంఈ షాకీర్, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.


శిలాఫలకం ఆవిష్కరించిన మంత్రి టీజీ భరత్

బుధవారపేటలో మంత్రి పర్యటన

కర్నూలు నగరంలోని 15వ వార్డు బుధవారపేటలో మంత్రి టీజీ భరత్ పర్యటించారు. స్థానిక సమస్యల గురించి ఆరా తీశారు. బుధవార పేట నుంచి హంద్రీ నది ఒడ్డున రక్షణ వలయం, మోడ్రన్ టాయిలెట్లు, పైపులైన్లు, సీసీ డ్రైన్లు ఏర్పాటు చేయాలని స్థానికులు మంత్రి దృష్టికి తెచ్చారు. వెంటనే వాటి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.అధికారులు, కార్పొరేటర్లు ఉన్నారు.

పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ వేగవంతం చేయాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జేసీ మధుసూదన్‌రావు, సీఈఓ విజయకుమార్ తదితరులు

కర్నూలు(అగ్రికల్చర్): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల కంప్యూటరీకరణను వేగవంతం చేయాలని సహకార శాఖ కమిషనర్ ఎ.బాబు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పాలక వర్గాలను ఆదేశించారు. శుక్రవారం గుంటూరు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. కంప్యూటరీకరణ వల్ల పీఏసీఎస్‌ల్లో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వస్తాయని, లావాదేవీలు వంద శాతం పారదర్శకంగా ఉంటాయన్నారు. అక్టోబరు 2 నుంచి ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. పైలెట్ ప్రాజెక్టుగా ప్రతి జిల్లాలో రెండు పీఏసీఎస్‌ల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని, అలాగే అన్ని సంఘాల్లోనూ పనులు చేపట్టాలన్నారు. కర్నూలు నుంచి అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్, ఇన్‌చార్జ్ జేసీ మధుసూదన్‌రావు మాట్లాడుతూ.. పసుపల, సీ.బెళగల్ పీఏసీఎస్‌లను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి కంప్యూటరీకరణ పనులు చేపడతామన్నారు. డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఈఓ విజయకుమార్, జీఎం రామాంజనేయులు, జిల్లా సహకార అధికారి ఎస్.రామాంజనేయులు, శిరీష, జాఫ్రిన్, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన విచారణ

కర్నూలు (అగ్రికల్చర్): ఈ నెల 1, 2 తేదీల్లో జరిగిన పింఛన్ల పంపిణీలో పాల్గొన్న వెటర్నరీ లైవ్ స్టాక్ అసిస్టెంట్లు, వెటర్నరీ డాక్టర్ పట్ల అనుచితంగా వ్యవహరించినట్లు కల్లూరు ఏరియా హాస్పిటల్ ఏడీ పార్థసారథిపై వచ్చిన ఆరోపణలపై బహుళార్థ పశువైద్యశాల డీడీ హేమంత్ కుమార్ విచారణ జరిపారు. శుక్రవారం బహుళార్థ పశువైద్యశాలలో వెటర్నరీ లైవ్ స్టాక్ అసిస్టెంట్లు రామ్మోహన్, రేఖారాణి, పుల్లగుమ్మి పశువైద్యురాలు స్వాతి, వీఏఎస్ అసోసియేషన్ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, జిల్లా నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నేరియన్స్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు విచారణకు హాజరయ్యారు. ఒక్కొక్కరి నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. ఒకటి రెండు రోజుల్లో జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్‌కు రిపోర్టు ఇవ్వనున్నారు.

సీబీజీ ప్లాంటు ఏర్పాటుకు చర్యలు


గార్గేయపురం వద్ద స్థల పరిశీలన చేస్తున్న కమిషనర్ రామలింగేశ్వర్

కర్నూలు (టౌన్): చెత్త నుంచి బయోగ్యాస్ తయారు చేసే కంప్రెస్ట్ బయోగ్యాస్ ప్లాంట్ (సీబీజీ) ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు నగరపాలక కమిషనర్ రామలింగేశ్వర్ స్పష్టం చేశారు. శుక్రవారం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, నగరపాలక ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో కలిసి కర్నూలు నగర శివారులోని గార్గేయపురం డంప్ యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఏటా టన్నుల కొద్ది వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నందున భూమి కలుషితమైపోతుందన్నారు. ఈ సమస్యను పరిష్కరించే దిశగా సీబీజీ ప్లాంటు అవశ్యకతను వివరించారు. ఈ ప్లాంటు నిర్మాణానికి 10 ఎకరాల స్థలం అవసరం అవుతుందని చెప్పారు. బయోగ్యాస్ తయారు చేసి వాహనాలకు నింపవచ్చన్నారు. మున్సిపల్ ఎంఈ షాకీర్, డీసీపీ సంధ్యారాణి, డీఈఈ నరేష్, ఏఈ దినేష్ పాల్గొన్నారు.